ప్రజాశక్తి
ఆదివారం 6 ఆగస్టు 2023
5
పార్వతీపురం మన్యం



వైఎస్ఆర్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

వైఎస్ఆర్ లైఫ్ టైం అవార్డు - 2023, వై.ఎస్.ఆర్ అచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. శని వారం ఆ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, (ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసిన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీసెస్, స్పోర్ట్స్ తదితర రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభా పాటవాలు చూపిన వ్యక్తులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వ్యక్తులు, సంస్థలు చేసిన పనిని ఒక పేజీలో క్లుప్తంగా తెలియజేస్తూ ఫోన్ నంబరు, ఇ మెయిల్ తో సహా తమ పూర్తి వివరాలను సమర్పించాలని ఆయన అన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలు తమ దరఖాస్తులను ఈనెల 20లోగా సమర్పించాలని ఆయన కోరారు.

చిన్నారి మరియమ్మకు వైద్యసేవలు

ప్రజాశక్తి - కొమరాడ

కొమరాడ మండలంలోని రెబ్బ గ్రామానికి చెందిన కోలక సోమయ్య, చంద్రమ్మ దంపతుల కుమార్తె మరియమ్మ(7)కు కూనేరు రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్‌స్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి చికిత్స అందించారు. మూడో తరగతి చదువుతున్న మరియమ్మ జ్వరం బారిన పడడంతో శుక్రవారం నాగావళి నదిలో వెదురుబొంగుల తెప్పపై ప్రమాదకరంగా ప్రయాణం చేసి చికిత్స కోసం అష్టకష్టాలు పడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో వైద్య సిబ్బంది స్పందించి కూనేరు రామభద్రపురం ఆస్పత్రికి తీసుకువావాలని సోమయ్యకు సూచించడంతో శనివారం ఆయన సిబ్బంది సహాయంతో మళ్లీ వెదురు బొంగుల తెప్పపైనా ఆస్పత్రికి తీసుకొచ్చాడు. చిన్నారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం మెరుగైన వైద్య సేవలు కోసం పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు వైద్య అధికారులు తెలిపారు.

గిరిజనుల ప్రాణాలతో చెలగాటం దారుణం : సిపిఎం

పాలకులు, అధికారులు గిరిజనుల ప్రాణాలతో చెలగాటం ఆడడం దారుణమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. శుక్రవారం రెబ్బ గ్రామానికి చెందిన మరియమ్మ వైద్య సేవలు కోసం నదిలో ప్రాణాలకు తెగించి ప్రమాదకర ప్రయాణం చేయడం బాధాకరమని అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు లాబేసు వంతెన నిర్మాణం పూర్తయితే గిరిజనులు పడుతున్న ఇబ్బందులు తప్పుతాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం పాలకుల సొంత స్వలాభం కోసం వంతెన నిర్మాణం మధ్యలో నిలిపివేయడం దుర్మార్గమన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కనీసం వంతెన పనులు ప్రారంభించకపోవడం చూస్తే గిరిజన పట్ల ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందన్నారు. గిరిజనులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరియమ్మ

పడుతున్న అష్ట కష్టాలను చూసి కనీసం స్పందించే పరిస్థితి కూడా కనిపించకపోవడం చాలా దారుణమన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే నుంచి ఉపముఖ్యమంత్రి స్థాయి వరకు పదవులు పొందినా కనీసం వంతెన నిర్మించకపోవడం దారుణమన్నారు. 1996లో నాటు పడవ మునిగిపోయి 36 మంది ప్రాణాలు పోయినా ఇప్పటికీ కనీసం వంతెన నిర్మించేందుకు ప్రభుత్వ చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే గిరిజనులకు ఎంతో అవసరమైన నాగావళి నదిపై వంతెన నిర్మాణం పూర్తి చేసి గిరిజనుల ఇబ్బందులను తొలగించాలన్నారు. వంతెన నిర్మాణం కోసం ఎప్పటికి దశలవారీగా అనేక మార్లు నిరసనలు ధర్నాలు చేశామని భవిష్యత్తులో కూడా అవసరమైతే పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు రక్షణ కరువు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలం వచ్చిందంటే చాలు విద్యార్థులకు ఆశ్రమ పాఠశాలల్లో రక్షణ కరువవుతుంది. ఒకవైపు విద్యార్థులు జ్వరాలతో బాధపడుతుంటే మరోవైపు పాము కాటుకు గురవుతున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలు లేకపోవడంతో విద్యార్థులకు సకాలం వైద్యం అందడం లేదు. విద్యార్థులకు రక్షణ చర్యలు కూడా లేకపోవడంతోనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దీంతో విద్యార్థుల ఆరోగ్య భద్రత దేవుడి మీదే భారం వేయాల్సి వస్తోంది.

గతంలోనూ పాము కాటుకు గురైన విద్యార్థులు

గతంలో కూడా విద్యార్థులు పాము కాటుకు గురైన సందర్భాల్లో



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిద్ధు

ఉన్నాయి. కురుపాం లోని జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మంతిని రంజిత్ కుమార్, ఈదుబిల్లి వంశీ, వంగపండు నవీన్ పాము కాటుకు గురయ్యారు. వీరిలో మంతిని రంజిత్‌కుమార్ మృతి చెందాడు. మిగతా ఇద్దరు విద్యార్థులు ప్రాణాలతో బయటపడ్డారు. ఇప్పటికైనా ఐటిడిఎ అధికారులు స్పందించి ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ చర్యలు చేపట్టాలని, ఆరోగ్య కార్యకర్తలను నియమించి స్థానికంగా వైద్యం అందించాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

పాలకుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మరణాలు

పాలకుల నిర్లక్ష్యం వలనే విద్యార్థులు పాము కాటుక గురికావడం, వ్యాధుల బారిన పడి మృతి చెందడం వంటి సంఘటనలు జరుగుతున్నాయని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్ అన్నారు. పాముకాటుకు గురైన విద్యార్థి సిద్ధూకు మెరుగైన వైద్యం అందించాలని, ఈ సంఘటనపై ఉన్నత అధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా విద్యార్థులకు స్థానికంగా వైద్యం అందించేందుకు ఆరోగ్య కార్యకర్తలను ప్రభుత్వం నియమించకపోవడం విచారకరమన్నారు. గిరిజన విద్య, విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి, ఐటిడిఎ అధికారులకు చిన్న చూపు తగదన్నారు.

పాము కాటుకు గురైన గిరిజన విద్యార్థి

పరిస్థితి విషమం

మండలంలోని టిక్కబాయి గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఏడవ తరగతి చదువుతున్న ఆరిక సిద్ధు అనే గిరిజన విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. రాత్రి నిద్రపోతున్న సమయంలో పాము వచ్చి కాటు వేసిందని, ఈ సంఘటన వేకువ జామున మూడున్నర సమయంలో జరిగిందని తోటి విద్యార్థులు తెలిపారు. అయితే సిద్ధు కడుపు నొప్పితో మాత్రమే బాధపడుతున్నాడని ఉపాధ్యాయులు అనుకున్నారు. ఆ తర్వాత పాము కనిపించడంతో పాము కాటుకు గురైనట్లు ఆలస్యంగా గుర్తించారు. అయితే స్థానికంగా వైద్య సేవలు లేకపోవడంతో వార్డెన్ పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి ఐసియులో చికిత్స పొందుతున్న సిద్ధును మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్ తరలించాలని వైద్యులు సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

టవర్ల ఏర్పాట్లపై కలెక్టర్‌కు అభినందనలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో మొబైల్ టవర్ల ఏర్పాటులోకలెక్టర్ నిశాంత్ కుమార్ తీసుకున్న చొరవ పట్ల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి ప్రశంసించారు. జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ నిర్మాణం, రీ సర్వే, మొబైల్ టవర్ల ఏర్పాటు, ప్రాధాన్యతా పనులు, జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై సమీక్షించారు. మొబైల్ టవర్ల ఏర్పాటులో చొరవ తీసుకుని స్థలాలను త్వరగా అప్పగించడం పట్ల ప్రధాన కార్యదర్శి సంతృప్తి వ్యక్తం చేసి ప్రశంసించారు. జగనన్న కాలనీలను జిల్లా కలెక్టర్లు సందర్శించి గృహాలు త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈనెలాఖరుకు రాష్ట్రంలో 5 లక్షల గహాలు ప్రారంభించడం జరుగుతుందని ఆయన చెప్పారు. నా భూమి - నా దేశం (మేరి మాటీ - మేరి దేష్), నేల తల్లికి నమస్కారం - నా దేశం కార్యక్రమాన్ని ఈనెల 9న ప్రారంభించాలన్నారు. వసుధ వందన్ కార్యక్రమాన్ని పంచాయితీలో నిర్వహించి కనీసం 75 మొక్కలు నాటాలని సూచించారు. పిఎం కిసాన్ - ఇ కెవైసి నమోదును ఈ నెల 31 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆడుదాం ఆంద్రా కార్యక్రమంను అక్టోబరు 2 నుండి నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం తగదు

కేంద్ర మాజీ మంత్రి అశోక్

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

వైసిపి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు నీళ్లువదిలేసి రైతులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని కేంద్ర మాజీ మంత్రి పి.అశోకగజపతిరాజు అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో విజయనగరం, పార్వతీపురం జిల్లా ఇన్చార్జీలు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈనెల 8,9 తేదీల్లో ఉభయజిల్లాల్లో టిడిపి అధినేత చంద్రబాబు పర్యటనపై సన్నాహక కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావుతో కలిసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేసిన విధ్వంసకర పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి అధోగతిపాలైందని విమర్శించారు. తమ ఐదేళ్ల పాలనలో రూ.12000కోట్లకు పైగా నిధులు సాగునీటి రంగానికి ఖర్చు చేస్తే తమ నాలుగేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వ కనీసం రూ.2వేల కోట్లు కూడా ఖర్చుచేయలేకపోయిందన్నారు. మూడు రాజధానుల పేరిటి అమరావతిని, రివర్స్ టెండరింగ్ పేరిట పోలరాన్ని భ్రష్టుపట్టించారని, సంక్షేమ పథకాల పేరిటి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి ప్రజలపై ఎనలేని రుణభారాన్ని రుద్దారని అన్నారు. సాగునీటి తీరుతెన్నులు, ప్రభుత్వ నిర్వాణాన్ని ప్రజలకు వివరించాలనే ఉద్దేశ్యంతో తమ అధినేత చంద్రబాబు రాష్ట్రంలో ప్రాజెక్టుల సందర్శన చేపట్టారని, ప్రజలకునిజాన్ని వెల్లడిస్తుంటే తట్టుకోలేక దాడులకు దిగబడుతున్నారని అన్నారు. ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా చంద్రబాబు ఈనెల 8న రాత్రి విజయనగరం చేరుకుని, రైతులు, మేధావులతో సమావేశం నిర్వహిస్తారని, 9న పార్వతీపురం మీదుగా తోటపల్లి రిజర్వాయర్ చేరుకుని పరిశీలించిన అనంతరం, పార్వతీపురంలో రోడ్, బహిరంగ సభను నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అరకుపార్లమెంటరీ అధ్యక్షులు గుమ్మడి సంధ్యారాణి, కిమిడి నాగార్జున, కోళ్ల లతితాకుమారి, బోనాల విజయచంద్ర, దామచర్ల సత్యనారాయణ, బి.గోవిందరాజులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్,



సిఎం సభా స్థలాన్ని పరిశీలిస్తున్న అశోక్‌గజపతిరాజు, నాయకులు

నాయకులు తోయిక జగదీశ్వరి, నిమ్మక జయకష్ణ, వీరేంద్రదేవ్‌తో పాటు వలువురు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

చిరంజీవులును పరామర్శ

ఇటీవల్ల తీవ్ర అస్వస్థతకు గురైన మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులును టిడిపి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల టిడిపి సీనియర్, ముఖ్యనాయకులు కృష్ణపల్లిలోని ఆయన స్వగహానికి వెళ్లి పరామర్శించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి కిమిటి కళావెంకటరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి పార్టీకి చిరంజీవులు చేసిన సేవలు పార్టీ ఎన్నడూ గుర్తుంచుకోవడమే కాకుండా ఆయన సేవలను భవిష్యత్తులో వినియోగించుకుంటుందన్నారు. ఆరోగ్యం కుదిటపడిన తర్వాత ఎప్పటిలాగానే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని నియోజకవర్గలో టిడిపి గెలువులో ముఖ్యభూమిక వహిస్తారని వెల్లడించారు.

సభా ప్రాంగణం పరిశీలన:

గరుగుబిల్లి : మండలంలో ఎర్రనగుడి జంక్షన్ వద్ద మీటింగ్ చంద్రబాబు ఏర్పాటు చేయనున్నారు. మీటింగ్ ఏర్పాటు జరిగే స్థలాన్ని అశోక్ గజపతిరాజు సమన్వయ కమిటీ సభ్యులు పరిశీలించారు.



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు ఎన్‌వై నాయుడు

7న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

మున్సిపల్ ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈనెల 7న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్.శంకర్రావు, ఎన్‌వై నాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద, ప్రజారోగ్య విభాగం రెండవ కార్యాలయం ఆవరణలో కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 7న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని పారిశుధ్య కార్మికులు, ఎలక్ట్రికల్, వాటర్ సెక్షన్, ఇంజనీరింగ్ విభాగం తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సింహాచలం, మల్లేష్, శ్రామిక మహిళ నాయకులు ఎన్.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని సాలూరులో నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై ఐటిడిఎ కార్యాలయంలో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గల గిరిజన కళాకారులు, వివిధ గిరిజన ఉత్పత్తులు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. గిరిజన ఉత్సవాలకు వచ్చే ప్రజలకు తాగునీరు సౌకర్యంతో పాటు ఇతర ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యం నిర్వహణ పక్కాగా ఉండాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో వేడుకలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి తదితర ఉన్నత అధికారులు పాల్గొంటారని ఆయన అన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ కె.హేమలత, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా ఆదివాసీ దినోత్సవం

సీతంపేట: ఆదివాసీ గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తామని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. శనివారం గిరిజన సంఘ నాయకులు ఐటిడిఎ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో అన్ని రకాల గిరిజన జాతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పూజా కార్యక్రమాల్లో గిరిజన సంస్కతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉత్సవానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో గిరిజన సంఘ నాయకులు బి.తేజేశ్వరరావు, కె.కాంతారావు, ఎన్ కాంతారావు, సత్యారావు, అప్పన్న, పడాల భూదేవి, ఎపిఒ రోషి రెడ్డి, డిడి శ్రీనివాసరావు, ఇఇ సింహాచలం, అధికారులు పాల్గొన్నారు.

మేనాటికి పనులు పూర్తి చేయాలి : సిఇ

ప్రజాశక్తి - వీరఘట్టం

తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఆధునీకరణ పనులను వచ్చే ఏడాది మేనాటికి పూర్తి చేయాలని నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు గుత్తేదారుని ఆదేశించారు. మండలంలోని ఎం.రాజుపురం వద్ద కాలువపై నిర్మించిన వంతెన పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కాలువలో లైనింగ్ పనులు చేపట్టినందు వల్ల కాలువలో నీటి ప్రవాహం వేగంగా పెరిగి శివారు ఆయకట్టు భూములకు త్వరితగతిన సాగునీరు సరఫరా అవుతుందని తెలిపారు. పనులు చేపట్టిన సమయంలో తీసుకోవాల్సిన



కాలువపై నిర్మించిన వంతెన పనులను పరిశీలిస్తున్న సిఇ సుగుణాకరరావు

జాగ్రత్తలు పరిశీలించాల్సిన అంశాలపై సాంకేతికపరమైన సూచనలిచ్చారు. చేపట్టిన పనులపై సంతప్తి వ్యక్తం చేస్తూ మిగిలిన పనులను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీరు ఎస్.పుల్లారావు, ఎస్ఇఎస్ సాయి శ్రీనివాస్, యాదవ్ బాల, ఇఇ డోల తిరుమలరావు, డిఇఇ లక్ష్మి, నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ డిఇ, ఇడి రవికుమార్, వీరఘట్టం, పాలకొండ ఎఇఇలు డివి రమణ, బి.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాధరావు అన్నారు. డాక్టర్ వైఎస్ ఆర్ కంటి వెలుగు కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా 1,11,439 మందికి నేత్ర పరీక్షలు చేసి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిందని అన్నారు. అలాగే జిల్లాలో 22,942 మందికి కళ్ల జోళ్లు పంపిణీ, 7719 మందికి అంతర కుసుమం శస్త్ర చికిత్సలు చేసినట్లు తెలిపారు. మండలంలోని అడ్డాపుశీలలో కంటివెలుగు సెల్ నేత్ర వైద్యులు డాక్టర్ జీరు నగేష్‌రెడ్డి ఆధ్వర్యాన శనివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ అవ్వా తాతలకు నేత్ర పరీక్షలు గతంలో నిర్వహించినప్పుడు నేత్ర పరీక్షలు చేయించుకోని వారికి మాఫ్ అప్ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయంల పరిధిలో ప్రజలకు నేత్ర పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అడ్డాపుశీల సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాల్లో 60ఏళ్ళు, ఆ పై బడి వయస్సు వారికి నేత్ర వైద్య సహాయకురాలు ఉమా మాహేశ్వరి నేత్ర పరీక్షలు జరిపినట్లు తెలిపారు. గతంలో నేత్ర పరీక్షలు జరిపి కళ్లజోళ్లు అవసరమైన వారికి కళ్లజోలు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో శస్త్ర చికిత్సలు,కళ్ళ జోళ్లు అవసరం అయినవారికి రిఫరల్ చేసినట్లు నేత్ర పరీక్షలు చేసిన వారిలో ఆపరేషన్ అవసరమని గుర్తించిన వారికి ఆగస్టు 16న పుష్పగిరి కంటిఆసుపత్రికి శస్త్ర చికిత్సలు కోసం తరలిస్తున్నట్లు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి తెలిపారు. వీరందరికి ఉచిత శస్త్ర చికిత్స, రవాణా, మందులు, భోజన వసతి, కళ్ల జోళ్ళు ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నట్లు తెలిపారు.

చంద్రబాబుపై దాడి దుర్మార్గపు చర్య

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుపై జరిగిన రాళ్ల దాడికి నిరసనగా జియమ్మవలస మండలం పెదమేరంగి కూడలి వద్ద టిడిపి నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పుంగనూరు బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు చంద్రబాబునాయుడుపై రాళ్ల దాడికి పాల్పడడం దుర్మార్గపు చర్య అన్నారు. పెద్దిరెడి నీకు సమయం దగ్గర పడిందని, ఈ రోజు నుంచి లెక్క పెట్టుకో అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పెద్దిరెడ్డిని అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బొంగు సురేష్, టిడిపి అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: చంద్రబాబునాయుడు రోడ్ షో అడ్డుకొని మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు అడ్డుకొని రాళ్లతో చేపట్టిన దాడికి నిరసనగా మండలంలో ఎర్రన్న గుడి జంక్షన్‌లో టిడిపి నాయకులు నిరసన తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరిగితే ఊరుకునేది లేదని, దాడికి పాల్పడిన మంత్రి పెద్దిరెడ్డిని, అతని అనుచరులను వెంటనే అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, మంత్రి పెద్దిరెడ్డిని మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదన్ రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి నాయకులు పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, ఎం బి. విజయ్ అంకుశం, అంబటి తవిటి నాయుడ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు పై దాడి అమానుషం

గుమ్మలక్ష్మీపురం: మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు చంద్రబాబు నాయుడుపై దాడి చేయడం అమానుషమని టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి అన్నారు.



సీతంపేటలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు


రాష్ట్రంలో టిడిపికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలా దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీతంపేటలో కొవ్వొత్తులతో ర్యాలీ

సీతంపేట : పుంగనూరులో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబుపై వైసిపి అల్లరి మూకలు రాళ్లు రువ్వడాన్ని నిరసిస్తూ శనివారం రాత్రి టిడిపి కార్యకర్తలు సీతంపేట హై స్కూల్ నుండి బస్టాండ్ వరకు కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహించారు అనంతరం మానవహారం చేపట్టారు. చంద్రబాబు పై రాళ్లు దాడి చేయడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పడాలి భూదేవి మాట్లాడుతూ వైసిపి అరాచకాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మయ్య కుంపి బిడ్డిక దమయంతి నాయుడు మాజీ ఎంపిటిసి బి జయలక్ష్మి మూర మోహన్ తదితరులు పాల్గొన్నారు..

మంత్రిగారికి బాధ్యతలేదా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఇప్పటికే జిల్లాలోని జ్యూట్ పరిశ్రమలు మూతపడ్డాయి. ఒక్కగానొక్క భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరణ పేరుతో మూసివేశారు. నష్టాలపేరిట ఎన్‌సిఎస్ సుగర్స్‌ను మూసివేయింప జేయడంతోపాటు దానికి సంబంధించిన ఆస్తులు దారదత్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సుమారు 50వేల కుటుంబాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయాయి. ఒకప్పుడు గౌరవంగా బతికే కుటుంబాలు ఇప్పుడు పుట్టెడు కష్టాల నడుమ బతుకీడుస్తున్నాయి. రోజుకు 8గంటలపాటు పనిచేస్తూ నిబ్బరంగా బతికే జ్యూట్ కార్మికులు పొట్టచేతపట్టుకుని ఊరుగాని ఊళ్లకు వలసపోయారు. కొంతమంది సెక్యూరిటీ గార్డుల అవతారమెత్తారు. ఇదంతా గడిచిన దశాబ్ద కాలంలో కళ్లెదుటే కనిపిస్తున్నప్పటికీ మంత్రి స్పందించలేదు. తాజాగా విద్యుత్ ఛార్జీల పెంపుతో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రంలో 36 ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఉండగా, ఒక్క విజయనగరంలోనే 21 పరిశ్రమలు ఉన్నాయని అన్నారు. ఇందులోనూ మంత్రి బొత్స ప్రాతినిధ్యం వహిస్తున్న చీపురుపల్లి నియోజకవర్గంలోనే ఎక్కువగా ఉన్నాయి. మొత్తంగా ఫెర్రో పరిశ్రమలపై ప్రత్యక్షంగా 60వేలు, పరోక్షంగా 6 లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఫెర్రో క్రోం తయారీలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండడం వల్ల విద్యుత్ భారంతో పరిశ్రమలు చాలా కాలంగా ఆర్థిక ఇబ్బందుల నడుమ నడుస్తున్నాయి. మార్చి 31 వరకు ఈ పరిశ్రమలకు ఒక యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.4.95 ఉండగా, ఏప్రిల్ 1 నుంచి ఒక యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.8.55లకు ప్రభుత్వం పెంచింది. జార్ఖాండ్ తదితర రాష్ట్రాల్లో ఫెర్రో పరిశ్రమలకు అక్కడి ప్రభుత్వాలు రూ.4కు, ఖతార్ వంటి దేశాల్లో రూ.3చొప్పున విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ ఛార్జీలపై రాయితీలు ప్రకటించాల్సిన పరిస్థితుల్లో భారాన్ని మరింతగా మోపడంతో పలు పరిశ్రమలు మూతపడ్డాయి. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో 5, గరివిడి ప్రాంతంలో 3, కొత్తవలస ప్రాంతంలో 1 ఇప్పటికే మూతపడగా, గరివిడి ఫేకర్ సహా మరికొన్ని పరిశ్రమల్లో ఉత్పత్తిని తగ్గించాయి. మరికొన్ని మూసివేత దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇటువంటి పరిశ్రమల్లో ప్రభుత్వంపై ఒత్తిడి చేసి పరిశ్రమలను కాపాడాల్సిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ 'లాభాలు వచ్చినప్పుడు ఎవరికైనా ఇచ్చారా?' అంటూ చేసిన వ్యాఖ్యల పట్ల కార్మికులు మండిపడుతున్నారు. చిత్తశుద్ధి ఉంటే యాజమాన్యాలకు నిర్ధిష్టమైన భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రి వైఖరి ఇలాగే ఉంటే ప్రభుత్వాన్నే రోడ్డుపైకి ఈడ్చాలంటూ ఇటీవల నగరంలో జరిగిన ఫెర్రో ఎల్లాయిస్ సదస్సు నిర్ణయించింది. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల పరిరక్షణకు ఈనెల 7న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపట్టాలని, అనంతరం వారం రోజులపాటు పరిశ్రమల వద్ద నిరసన దీక్షలు చేపట్టాలని, అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే ఆగస్టు చివరి వారంలో ఏకంగా చలో అసెంబ్లీ నిర్వహించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. మంత్రి బొత్స వైఖరిని కూడా తప్పుపట్టింది.


సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ అధ్యక్షులు రమేష్

భాషా వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న భాషా వాలంటీర్లదరికీ గౌరవ వేతనం పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి. రమేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని పి.లేవిడిలో జరిగిన సవర భాష వాలంటీర్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి హయాంలో గిరిజన గ్రామాల్లో గిరిజన పిల్లలకు వారి భాషలో అర్థమయ్యేలా పాఠాలు చెప్పేందుకు భాషా వాలంటీర్లను నియమించారని అటువంటివి ఇప్పుడు వారిని ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. కావున వాలంటీర్లంతా ఏకతాటి పైకి వచ్చి భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందించి పోరాటాలకు సన్నద్ధమైతేనే న్యాయం జరుగుతుందని, దీనికి అంతా సన్నద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలంలో గల సవర భాష వాలంటీర్లు పాల్గొన్నారు.

బోగస్ కులధ్రువీకరణ పత్రాలపై విచారణ వేగవంతం

ప్రజాశక్తి - సీతంపేట

బోగస్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను పొందిన వారిపై చేపడుతున్న విచారణను వేగవంతం చేస్తామని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. శనివారం 4 కేసులకు సంబంధించి విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలు పొందినట్టు అభియోగం ఎదుర్కొంటున్న వారితో మాట్లాడారు. వారి విద్యార్హత, కుల ధ్రువపత్రాలను పరిశీలించారు. సంబంధిత తహాశీల్దార్‌తో మాట్లాడి ఇంకా పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, వీరఘట్టం తహసీల్దార్, డీడీ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ దేశ్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మక్కువ సచివాలయంలో వైయస్సార్ సంపూర్ణ పోషణ టిహెచ్ఆర్ పంపిణీ రంగునాయుడు చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, వర్కర్లు, పలువురు బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

బోరు మెకానిక్ మృతి బాధాకరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

బోర్ మెకానిక్ శంకర్రావు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బోర్ మెకానిక్ గాపనిచేస్తున్న కలిశెట్టి శంకర్రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గరుగుబిల్లి పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో నివాసముంటున్న శంకరరావు కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా తమ ప్రగాఢ సంతాపమును తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపిపి ఉరిటి రామారావు, జెడ్‌పి వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, స్థానిక సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, స్థానిక ఎంపీటీసీ సభ్యులు దేవాతి నారాయణమ్మ, వైసిపి నాయకులు ఉన్నారు.


సింహాచలంనాయుడు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్నఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

మాజీ సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని నాగూరులో మాజీ సర్పంచ్ వాసిరెడ్డి సింహాచలం నాయుడు ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి, జెడ్‌పి వైస్ చైర్మన్ మరిశర్ల బాబూజీ నాయుడు, ఎంపిపి ఉరిటి రామారావు శనివారం పరామర్శించారు. సింహాచలం నాయుడు భార్య వాసిరెడ్డి సత్యవతమ్మతో మాట్లాడి కుటుంబాన్ని అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో స్థానిక నాయకులు కేతిరెడ్డి అచ్యుతరావు, మాజీ సర్పంచ్ కేతిరెడ్డి కూర్మానాయుడు, నాగూరు సచివాలయం కన్వీనర్ వెంకటనాయుడు, అప్పలనాయుడు ఉన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో శత శాతం స్టోన్ ప్లాంటేషన్ పనులను చేపట్టాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మండలంలో పర్యటించి రెవెన్యూ, సర్వే అధికారులకు సూచనలు జారీ చేశారు. మండలంలో ఇప్పటివరకు ఎల్విన్ పేట పంచాయతీ, రేగులపాడు 103 స్టోన్ ప్లాంటేషన్ చేయాల్సి ఉండగా నేటి వరకు 86 రాళ్లను పాతించినట్లు తెలిపారు. మిగతా పనులను సాధ్యమైనంత మేరకు రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మండలంలో భూ సర్వే పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సహాయపడాలని ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ జె.రాములమ్మ, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

టిటిడి స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది మురళీకృష్ణ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి చెందిన సిహెచ్.మురళీకృష్ణ తిరుమల తిరుపతి దేవస్థానం స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. మురళీకష్ణ రాష్ట్ర హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆయన్ను టిటిడి స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ దేవస్థానం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. టిటిడి కి సంబంధించిన కేసులను ఆయన హైకోర్టు లో వాదిస్తారు.

భూ హక్కు పత్రంతో మేలు

ప్రజాశక్తి - వీరఘట్టం

భూ హక్కు పత్రంతో రైతులకు అనేక మేలు చేకూరుతుందని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ అన్నారు. శనివారం భూ హక్కు పత్రాల పంపిణీలో పాల్గొన్నారు. ఇటీవల చేపట్టిన రీ సర్వే కార్యక్రమంలో భాగంగా రేగులపాడు 346, జె.గోపాలపురం 225, శ్రీహరిపురం 247, నడిమికెళ్ల 426, పెద్దూరు మహాదేవివలస 179 మంది రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని చిలకలపల్లిలో శనివారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు రైతులకు అందిస్తున్న నవధాన్యాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం బడుగు బలహీన దళితుల కోసం చేపడుతున్న కార్యక్రమాల్లో ఇది ప్రధానమైనదని ఆయన అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి అలజంగి రవికుమార్, ఎంపిపి గుడివాడ నాగమణి, ఎఇఒ శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


నవధాన్యాల కిట్లను రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

వాడీ వేడిగా సర్వసభ్య సమావేశం

అధికార పార్టీ సభ్యుల మధ్య వాగ్వివాదం
బహిష్కరించిన సభ్యులు

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.ప్రమీల అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. అధికార పార్టీ సభ్యుల మధ్యే ఈ వాగ్వివాదం చోటు చేసుకుంది. తొలుత కేసలి, మోసూరు పంచాయతీల సర్పంచులు ఎస్.నిర్మల, జి.చంటి మాట్లాడుతూ మండలంలో ఎంపిటిసి సెగ్మెంట్లకు సంబంధించి గడిచిన రెండున్నర ఏళ్లలో ఒక్కొక్క సెగ్మెంట్‌కు ఎంత ఎంత నిధులు కేటాయించారు? ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేశారో తెలపాలని ఎంపిపిని ప్రశ్నించారు. బడ్జెట్ సమావేశంలో నిధులు కేటాయింపులకు సంబంధించి చర్చించాలని సర్వసభ్య సమావేశంలో కేవలం సమస్యలపైనే ప్రస్తావించాలని, ఇప్పుడు సమయం కాదని ఎంపిపి సమాధానం ఇచ్చారు. దీంతో అసంతృప్తి చెందిన సర్పంచులు, మరి కొంతమంది ఎంపిటిసి సభ్యులు ఇప్పుడే తెలపాలని పట్టుపట్టడంతో వైస్ ఎంపిపి కె.రవీంద్ర జోక్యం చేసుకొని బడ్జెట్ సమావేశంలో చర్చించాల్సిన విషయాలు ఇప్పుడు చర్చించడం ఏమిటని మరోమారు అనడంతో సమావేశ మందిరం బయట ఉన్న కేసలి, మోసూరు సర్పంచులు భర్తలు ఎస్ రాము, జి.రాము సభలోకి దూసుకొచ్చి వైస్ ఎంపిపితో వాగ్వాదానికి దిగారు. దీంతో సభ ఒక్కసారిగా గందరగోళంగా మారింది. దీంతో వైస్ ఎంపిపి మీసాల నారాయణతో పాటు మరికొంత మంది సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సమావేశం నుంచి బాయికట్ చేశారు. గుమ్మడి గూడ, మోదుగ ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు తుక్కుబట్టి నేలకొరవడంతో విద్యుత్ షాక్‌కు గురై మూగ జీవులు మృత్యువాత పడుతున్నాయని, దీంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారని తక్షణమే కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ఎఇ రమేష్‌ను కోరారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో పక్కా పాఠశాల భవనాలు లేక ఉన్న భవనాలు పూర్తిగా మరమ్మతులు గురి కావడంతో భయం గుప్పెట్లో గిరిజన పిల్లలకు విద్యా బోధనలు అందుతున్నాయని, కొత్త పాఠశాల భవనాలు నిర్మించాలని ఎంఇఒ పి.జోగారావును ఆయా ప్రాంత గిరిజన ప్రజాప్రతినిధులు కోరారు. అలాగే పలు శాఖలపై చర్చలు జరిగాయి. సమావేశంలో ఎంపిడిఒ జి.పార్వతి, వైస్ ఎంపిపి మీసాల నారాయణ, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీతానగరం : పలు సమస్యలపై రామవరం, జోగింపేట, పాపంవలస పంచాయతీల సర్పంచులు పి.సత్యనారాయణ, ఎం.గౌరునాయుడు, కె.సింహాచలం అధికారులను ప్రశ్నించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.రవణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియా, డిఎపి సరిపడా ఉన్నాయన్నారు. సర్పంచ్ ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. హరిత రాయబారులకు పంచాయతీ నిధుల నుంచి జీతాలు చెల్లించలేమని సర్పంచులు ఖరాఖండీగా చెప్పారు. ఎంఇఒ జి.సూరి దేవుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు సంఖ్య తగ్గుతున్నప్పటికీ కొన్ని గ్రామాల్లో పాఠశాలలు పెరుగుతున్నాయన్నారు. దీనిపై సర్పంచు మాట్లాడుతూ స్కూల్‌కు కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేస్తే విద్యార్థులు బయటకు ఎందుకు వెళ్తారని ప్రశ్నించారు. దీనిపై స్పష్టమైన సమాధానం రాలేదు. అన్ని సమస్యలపై సర్పంచులు, అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిడిఒ ఎంఎస్ఎల్వి ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, వివిధ శాఖ అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.


ఎంపిపి, వైస్ ఎంపిపితో వాగ్వివాదం చేస్తున్న సర్పంచుల భర్తలు

రీ సర్వేలోనూ తప్పులేనా?

సాలూరురూరల్ : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని ప్రయత్నిస్తున్న రెవెన్యూ అధికారులు మాత్రం ఇంకా తప్పులను చేస్తూనే ఉన్నారని మండల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ ఎ.రమాదేవి ఆధ్వర్యంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అధ్యక్షతన జరిగింది. తొలుత కురుకుట్టి, శివరాంపురం ఎంపిటిసి సభ్యులు సుబ్బారావు, త్రినాథ్ నాయుడు, తోణాం, శివరాంపురం, జీగిరాం సర్పంచులు మువ్వల ఆదయ్య, జరజాపు మోహన్, జి.సూరప్పల నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి రైతు భూమి వివరాలు, కొలతలు సరి చేసేందు ప్రభుత్వం జగనన్న భూ రక్ష కార్యక్రమంలో భాగంగా రీ సర్వేను నిర్వహించిందన్నారు. అయితే రీసర్వే అయినా ఇంకా వాటిలోనూ తప్పులను సరిదిద్దడంలేదని, భూమి లేని వారి పేరున భూమి ఉన్నట్లు, ఎకరా భూమి ఉంటే 40 ఎకరాలు కంప్యూటర్‌లో చూపించడం వల్ల సన్న, చిన్న కారు రైతులకు రావాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. దీనికి ఆర్ఐ జగదీష్ సమాధానమిస్తూ రీ సర్వేను సక్రమంగా అమలు చేస్తున్నామని, ఇంకా అక్కడక్కడ పొరపాట్లు ఉంటే పై అధికారులకు తెలియజేసి సరిచేస్తామని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో మండలం మొత్తం సర్టిఫికెట్లు అందజేశామన్నారు. భూమిలేని నిరుపేద గిరిజనులను గుర్తించి డి-పట్టాలు మంజూరు చేయమని కలెక్టర్‌కు పంపామని తెలిపారు. మామిడిపల్లి, బాగువలస, తోణాం వైద్యాధికారులు మాట్లాడుతూ వర్షాకాలంలో జ్వరాలు ప్రబలకుండా ముందుగానే గ్రామాల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ జరిపించాలని కోరారు. ఇళ్ల నిర్మాణ పనులు కూడా ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు హౌసింగ్ ఎఇ తెలిపారు. విద్యుత్ శాఖ ఎఇ సింహాచలం మాట్లాడుతుండగా తోణాం సర్పంచ్ మువ్వల ఆదియ్య జోక్యం చేసుకుంటూ తమ గ్రామంలో చాలా విద్యుత్ స్తంభాలు వాలి, మధ్యలో ఇరిగి పోయి ఉన్నాయని, వీటిపై అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. దీనికి ఎఇ వివరణ ఇస్తూ గ్రామంలో స్తంభాలు గాని, వైర్లు గాని పాడైపోయిన వాటికి సరిపడా డబ్బును చెల్లించాలని, లేదా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి.వద్ద గాని లెటర్ తీసుకువస్తేనే కొత్తవి ఇస్తామని తెలిపారు. ఇప్పటికే పంచాయతీల్లో రూపాయి లేకుండా వుంటే ఇప్పుడు వీటిని ఎక్కడ నుండి తేవాలని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి, ఎఎంసి చైర్ పర్సన్ దండి అనంతకుమారి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డి పద్మావతి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

7 నుంచి ప్రత్యేక టీకా కార్యక్రమం

ప్రజాశక్తి - సీతానగరం

మిషన్ ఇంద్ర ధనుష్, డీ వార్మింగ్ కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలని సీతానగరం, పెదంకలం వైద్యులు శిరీష, రాధాకాంత్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బలగ రమణమ్మ, జెడ్పీటీసీ బాబ్జీతో పాటు మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచుల చేతుల మీదుగా ఆయా కార్యక్రమాలకు సంబంధించి పోస్టర్లు ఆవిష్కరణ చేశారు. మిషన్ ఇంద్ర ధనుష్ ద్వారా పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల పిల్లల వరకు షెడ్యూల్ ప్రకారం వ్యాధినిరోధక టీకాలు వేయాలని, ఏమైనా కారణాల వల్ల ఆ సమయానికి పిల్లలకు టీకా వేయకపోతే వారిని గుర్తించి, వారికి ఈనెల 7నుంచి 12 వరకు వేయడమే లక్ష్యమని వైద్యులు తెలిపారు. ఈనెల 10న డి-వార్మింగ్ డే కార్యక్రమం ద్వారా నులిపురుగులు నివారణకు మందులు వేస్తామన్నారు. అందరు దీనిపై దృష్టిపెట్టి సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాద్, ఇఒపిఆర్‌డి వర్మ మండల అధికారులు, ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు. అనంతరం రెండో పూట ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని వైద్యులు శిరీష, రాధాకాంత్‌లు నిర్వహించి డీ వార్మింగ్ కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. పిల్లలకు నులిపురుగులు మందులు వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాద్, ఎంఇఒ సూరిదేముడు, వెంకటరమణ, హెచ్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు సూచించారు. స్థానిక పిహెచ్‌సికి శనివారం విచ్చేసిన ఆయన గరుగుబిల్లి, రావివలస పిహెచ్‌సిల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి సూచనలు, సలహాలను అందజేశారు. అలాగే ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జ్వరలక్షణాలతో ఎవరొచ్చినా వెంటనే పరీక్షలు జరిపి, తగు చికిత్స ఇవ్వాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈనెల10న జరగబోయే డీ వార్మింగ్ డే (నులి పురుగులు నివారణ కార్యక్రమం)కు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 7 నుండి 12 వరకు జరగబోయే మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమానికి టీకా కొరకు సర్వేలో గుర్తించిన పిల్లలు, గర్భిణీలను యూవిన్ లో అప్లోడ్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో గరుగుబిల్లి, రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ పిఎ ప్రియాంక, డాక్టర్ కర్రి అరుణకుమారి, డాక్టర్ కె.కె. సాగర్ వర్మ, హెల్త్ విజిటర్ చింతాడ ఉదయ్‌కుమారి, ఎంఇఒ నాగిరెడ్డి నాగభూషణరావు, ఇఒపిఆర్ డిఎల్ గోపాలరావు, అంగన్వాడీ వర్కర్లు పి.కృష్ణవేణి, ఆర్.పద్మ, ఎం.స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 2 నుండి 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి - బెలగాం

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం అక్టోబరు 2న ప్రారంభం అవుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఫిట్ ఆంధ్రా ధ్యేయంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయం స్థాయి నుండి మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గ్రామం, ప్రాంతంలో గల స్థానిక క్రీడలతో సహా మూడు కిలో మీటర్ల మారథాన్, యోగా, టెన్నికోయిట్ వంటి క్రీడలు ముఖ్యంగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీ బాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలను పురుషులు, మహిళలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో ఆయా గ్రామాలకు చెందిన అభ్యర్థులు క్రీడల్లో పాల్గొనవచ్చున్నారు. గుర్తింపు కార్డుగా ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు చూపించాలని ఆయన పేర్కొన్నారు. క్రికెట్, వాలీ బాల్, కబడ్డీ, ఖో ఖో క్రీడలకు నియోజక వర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందజేస్తామన్నారు. లోగో, మస్కట్‌ను రూపొందించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలకు అన్ని ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులకు ఆదేశించారు. వివిధ కమిటీలను నియమించాలని, క్రీడా మైదానాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సచివాలయం స్థాయిలో సమాచారం అందించి ప్రతి ఒక్కరూ అవగాహన పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జున అవార్డు గ్రహీత శీరా జయరామ్ జిల్లా స్పోర్ట్స్ అంబాజిడర్ గా ప్రభుత్వం నియమించిందని ఆయన చెప్పారు.

ఆడుదాం ఆంధ్రా లోగో, మస్కట్ పోటీలు

ఆడుదాం ఆంధ్రా క్రీడల లోగో, మస్కట్ లను రూపొందించుటకు పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆడుదాం ఆంధ్రా క్రీడలకు లోగో, మస్కట్ రూపొందించుటకు పోటీలను పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయం విద్యార్థులతో పాటు, ఆంధ్ర ప్రదేశ్ పౌరులు ఎవరైనా పాల్గొన వచ్చని తెలిపారు. మంచి ఆలోచనా విధానంతో చక్కటి సృజనాత్మకత కలిగిన లోగో, మస్కట్‌లు రూపొందించిన వారికి బహుమతులను ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. పోటీలు అన్ లైన్‌లో http://sports.ap.gov.in వెబ్ సైట్ లో ఆగస్టు 1 నుండి 7 వరకు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. "ఆంధ్ర ప్రదేశ్ లో క్రీడలు, ఆరోగ్యం, దఢత్వం ప్రోత్సహించడం" శీర్షికన పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. లోగో డిజైన్‌తో పాటు తెలుగులో టాగ్ లైన్ సమర్పించాలని, మస్కట్‌కు ప్రత్యేకంగా సమర్పించాలని పేర్కొన్నారు. సజనాత్మకత, వాస్తవికత (ఒరిజినాలిటి), కూర్పు, సాంకేతిక ప్రతిభ, కళాత్మకత, కనిపించే విధానం తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.సమావేశంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు, డిఎస్‌పి జి.మురళీధర్, డిపిఒ బి.సత్యనారాయణ, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, క్రీడల చీఫ్ కోచ్ ఎస్. వెంకటేశ్వర రావు, డి ఎల్ డిఒ గోపాల కష్ణ,సివిల్ సప్లయ్‌జిల్లా మేనేజర్ ఎం. డి.నాయక్, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుంబిడి ఇచ్చాపురంలో జ్వరాలు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని కత్తులకవిటి సచివాలయం పరిధి కుంబులి ఇచ్చాపురం గిరిజన గ్రామంలో జ్వరాలు తీవ్రం కావడంతో వైద్యం కోసం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిట లాడుతున్నాయి. బిడ్డక వేణు, పాలక రాఘవ, విశ్వనాధం, ఆరిక భాను ప్రసాదు, బిడ్డక ధనలక్ష్మి తదితరులు జ్వరాల బారినపడి నలిగిపోతున్నారు. మరి కొంతమంది పాలకొండ, శ్రీకాకుళం పట్టణ ప్రాంతాలకు పరుగులు తీసి జ్వరాలను తగ్గించుకునేందుకు ఆరాటం పడుతున్నప్పటికీ జ్వరాలు అదుపులోకి రావడంలేదని గిరి పుత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లి చదువుకోవాల్సిన పిల్లలు ఆస్పత్రి పాలుకావడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ జ్వరాలు అదుపులోకి రావట్లేదని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలే కాకా ఇంటికి ఒకరు లేదా రెండు మంచాలు చొప్పున జ్వరాలతో మంచాన పడి ఉన్నారు. వారం రోజులుగా జ్వరాలతో బాధపడుతూ మంచం పట్టినప్పటికీ ప్రభుత్వం వైద్యం కరువైందని గిరిజనులు వాపోతున్నారు.


ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

జీతాలు చెల్లించాలని టీచర్ల నిరసన

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని శనివారం స్థానిక తహాశీల్దార్, ఎంఇఒ కార్యాలయాల వద్ద ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. జూన్‌లో బదిలీలు, ప్రమోషన్లు అయిన ఉపాధ్యాయులకు నేటి వరకు జీతాలు చెల్లించలేదని, పెండింగ్లో ఉన్న జీతాలు తక్షణమే చెల్లించాలని నినాదాలు చేశారు. తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు ఆర్.ధనుంజయ నాయుడు, మండల నాయకులు బివి నాయుడు, బిఎం గౌరీశ్వరరావు, దాసరి శ్రీనివాసరావు, బి.రామారావు, ఎం.మురళి, అప్పలనాయుడు, రవికుమార్, ఎస్.మోహనరావు, రాజశేఖర్, గౌరు నాయుడు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాఎపిటిఎఫ్ గౌరవాధ్యక్షులు మర్రాపు మహేష్ మాట్లాడుతూ జీతాలపై ఆధారపడిన ఉపాధ్యాయులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. తక్షణమే రెండునెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తిప్పాన సన్యాసిరావు, అల్లు మహేశ్వరరావు మండల సబ్ కమిటీ సభ్యులు భీమవరపు మన్మధరావు, బొత్స శ్రీనివాసరావు, బౌరోతు సన్యాసినాయుడు, ద్వారపురెడ్డి రమేష్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: ఉపాధ్యాయుల బదిలీలు జరిగి రెండు నెలలు కావస్తున్నా జీతాలు చెల్లింపులో జాప్యానికి నిరసనగా ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు ఎ.చంద్రశేఖర్, సత్యనారాయణ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ బాలమురళీకష్ణకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల నాయకులు అంబటి సన్యాసిరావు, జిల్లా నాయకులు గౌరీశంకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముక్తేశ్వర పాణిగ్రాహి పాల్గొన్నారు.

పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి అధికారులు కొంత కృషి చేస్తున్న పాలకుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో వంతెన నిర్మాణ పనులు పూర్తి కావడం లేదని స్పష్టం చేశారు. గిరిజన ప్రజల కష్టాలు, కన్నీళ్లు పాలకులకు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. గిరిజన బాలికకు మెరుగైన వైద్యం అందించాలని ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణను కోరినట్లు వారు తెలిపారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు అనారోగ్య బారిన పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జియమ్మవలస మండలం పెద్దబుడ్డిడి సర్పంచి సీమల సుజాత తెలిపారు. గ్రామంలో ఉన్న మురికి కాలువలు, ఇంటి పరిసరాలు, బోర్ల వద్ద శనివారం పారిశుధ్య పనులు, దోమల మందు స్ప్రేయింగ్ దగ్గరుండి చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మరగపెట్టిన నీటిని తాగాలని, దోమతెరలు వాడకం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సీమల బాబు, మోహన్‌రావు, పి.శ్రీరామ్, ఆశా వర్కర్లు ఉన్నారు.

మహేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - మక్కువ

ఇటీవల జ్వరంతో బాధపడుతూ మృతి చెందిన గిరిజన విద్యార్థి బిడ్డిక మహేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంఘాల జెఎసి ప్రధాన కార్యదర్శి జయన్న డిమాండ్ చేశారు. శనివారం మహేంద్ర కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఎక్స్‌గ్రేషియో నిమత్తం వినతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన, జెఎసి నాయకులు హిమరక ప్రసాద్, కూరంగి అజయ్‌బాబు, సునీల్, జెఎజెసి కార్యవర్గసభ్యులు రూప తదితరులు పాల్గొన్నారు. అనంతరం యర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడ్ని కలిసి మహేంద్ర మరణం పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో వసతులు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులును అడిగి తెలుసుకున్నారు.

శ్రమదానంతో గిరిజనులు రోడ్డు

ప్రజాశక్తి - కురుపాం

అధ్వానంగా ఉన్న రహదారి మధ్య రాకపోకలు సాగించేందుకు సదుపాయం కల్పించాలని అధికారులను కోరినా పట్టించుకోకపోవడంతో ఇలా గ్రామస్తులే ఏకంగా 2 కిలోమీటర్ల మేర రహదారిని బాగుచేసుకున్నారు. ఈ సంఘటన మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ సింగుపురంలో శనివారం జరిగింది. బియ్యాలవలస నుంచి సింగుపురం వెళ్లేందుకు మట్టి రోడ్డుతో పాటు ఘాటి ఎక్కాల్సిందే. ఇటీవల ఓ గర్భణికి అత్యవసరం పరిస్థితిలో 108 వాహనం కూడా గ్రామానికి రాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో చివరికి కొందరూ మహిళలు గర్భణిని నడిపించుకుంటూ 108 వాహనం ఉన్న వద్దకు వరకు తీసుకువెళ్లి ఎక్కించారు. ఈ అవస్థలను గనించి తామే స్వచ్ఛందంగా కొంత నగదును ఎత్తుకొని శ్రమదానంతో రహదారి నిర్మాణ పనులు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ గ్రామానికి పూర్తిస్థాయిలో బీటీ రహదారి వేసి రాకపోకలు కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ధారపాడు, చెక్కాపురంలో చేపడుతున్న మలాథియన్ పిచికారీని శనివారం సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐఆర్ఎస్ ద్రావణం ఐదు శాతం పిచికారీ చేశారు. అనంతరం గ్రామంలో అవగాహన కల్పించారు. కాలువల్లో యాంటీ లార్వా నిర్వహించారు. అనంతరం ధోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భాను ప్రతాప్, సీతంపేట బాలుర గురుకుల పాఠశాల వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తిరుపతి రాజు తదితరులు ఉన్నారు

120లీటర్ల సారా స్వాధీనం

పార్వతీపురం రూరల్ : మండలంలోని గంగాపురం పంచాయతీ తొక్కుడువలస గ్రామ సమీపంలో శనివారం పోలీసులు దాడి చేసి 120 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సింహాచలం తెలిపారు. ఈ దాడిలో అడ్డూరువలసకు చెందిన వై సింహాచలం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని ఒక మోటారుసైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పునుగు పిల్లుల సంచారంపై పరిశీలన

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని స్థానికంగా ఉన్న చిన్న వీధి రామాలయం వద్ద సుమారు 12 పునుగు పిల్లలు సంచారం చేస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం పునుగు పిల్లలు సంచార స్థలాల్లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి.త్రినాధ్, సెక్షన్ ఆఫీసర్ మనోజ్ కుమార్ పరిశీలన చేశారు. పునుగు పిల్లులు సంచారం చేయడం నిజమేనని అవి ఎక్కడి నుంచి వచ్చాయి, ఎలా వచ్చాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. రెండేళ్ల నుంచి సుమారు 12 పునుగు పిల్లులు బలిజిపేట స్థానిక పురవీధులు చిన్న వీధి, రామాలయం పరిధిలో ఉన్నట్లు తెలిపారని, దీని విషయమై సమగ్ర దర్యాప్తు చేసే తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వై సత్యనారాయణ, పడాల పెంటరాయుడు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్.బి.జగన్నాధరావు అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగ నియంత్రణపై కౌన్సిలర్లకు శిక్షణా కార్యక్రమం శనివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగ నియంత్రణపై దేశవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జిల్లాలో డ్రగ్ నివారణకు సేవలందిస్తున్న కౌన్సిలర్లకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత, ఇన్ ఛార్జ్ అడిషనల్ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.శ్యామ్‌కుమార్, ఇతర జిల్లా అధికారులు, మాస్టర్ ట్రైనర్ సూర్యప్రకాశరావు, సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాజు తదితరులు పాల్గొన్నారు.